సాక్షి వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవిమఠం ఉత్సవ శోభను సంతరించుకుంది. అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. -8లో



మద్యం మత్తు.. ప్రాణాలు చిత్తు

మద్యం మత్తు, అతి వేగం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. మద్యం తాగి ఆటోను నడుపుతూ ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొనడంతో దంపతులు దుర్మరణం చెందారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
30.5/21.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 21.8 – 30.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

ఫీజు చెల్లింపు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ ఇంటర్ పరీక్ష ఫీజు గడువును ఈనెల 31 వరకు పొడిగించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కోఆర్డినేటర్ రాజారావు తెలిపారు. ఓపెన్ ఇంటర్‌లో చేరే విద్యా ర్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చన్నారు. తత్కాల్ రుసుంతో కూడా అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. మిగతా విషయాలకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కోఆర్డినేటర్ రాజారావును 91820 99672 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

26న శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ జాతరకు వేలం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ దేవస్థానంలో ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్న జాతరకు సంబంధించి వేలం పాటను ఈనెల 26వన నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతరలో తలనీలాలు, కొబ్బరికాయలు, టోల్గేట్, ప్రతి ఆదివారం ఏడాది పాటు ఆలయం ముందు కొబ్బరికాయలు, పూలదండల విక్రయానికి సంబంధించిన వేలం భక్తులు, గ్రామస్తుల సమక్షంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ. 50 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. హిందూ సంప్రదాయ పద్ధతుల్లో వేలం నిర్వహిస్తామని వారు తెలిపారు.

విజయరాజు యాదవ్‌కు డాక్టరేట్



కడప కల్చరల్: తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ పరిశోధకులు రాచగాళ్ల విజయరాజు యాదవ్ డాక్టరేట్ పొందారు. ఆయన 'పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ నిఫ్టీ – 50 కంపెనీస్' అంశంపై ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. జిల్లాలోని బ్రహ్మంగారి మఠానికి చెందిన విజయరాజు యాదవ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. వీరి తండ్రి రాచగాళ్ల పెంచలయ్య ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. తన పరిశోధనా కాలంలో విజయరాజు యాదవ్ పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈయన రూపొందించిన ఆరు పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, విజయరాజు యాదవ్‌కు అభినందనలు తెలియజేశారు.

మరీ అంత అలుసా!

- అంగన్‌వాడీలకు బాలారిష్టాలు
- చిన్నారులకు నేటికీ అందని పుస్తకాలు
- విద్యా సంవత్సరం సగం గడిచినా ప్రభుత్వ చర్యలు శూన్యం
- పాత పుస్తకాలతో విద్యాబోధన చేస్తున్న కార్యకర్తలు
- పలకలతోనే సరిపెడుతున్న కూటమి సర్కార్





అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులను ఆడిస్తున్న కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా భావిస్తారు. అలాంటి బాలలకు ప్రాథమిక దశలో అక్షరాలు దిద్దించి విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు పౌష్టికాహారం అందిస్తూ మంచి ఆరోగ్యంతో ఉండేలా అంగన్వాడీ కేంద్రాలు తీర్చిదిద్దేవి. పిల్లలకు చదువుపై ఉత్సకత, ఏకాగ్రత అలవర్చే అంగన్వాడీ కేంద్రాలను వైఎస్సార్ సీపీ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీ కేంద్రాలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. మొదట కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2 కిట్ల రూపంలో ఐదు రకాల పుస్తకాలు అందజేసి వాటి ద్వారా ఆసక్తికరమైన, సులభతర విద్యాభ్యాసానికి నాంది పలకడంతోపాటు వారిలో సృజనాత్మకతను పెంచేలా పెద్దపీట వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటన్నింటినీ రద్దుచేసి అంగన్వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు అంగన్వాడీ కేంద్రాలకు పుస్తకాలను పంపకుండా చిన్నారుల అక్షర జ్ఞానానికి అడ్డుపడుతోంది.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు:	13
వాటి పరిధిలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలు:	2389
అంగన్వాడీలకు వస్తున్న చిన్నారులు:	1,02,235



- అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల చదువుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోపాటు చిన్నారుల పౌష్టికాహారం చదువులపై నీలి నీడలు కమ్ముతున్నాయి. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీ చిన్నారులకు మెరుగైన వసతులతో కూడిన విద్యను అందిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో విఫలమయ్యారు. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులకు పుస్తకాలు లేక పలక, బలపం ఇచ్చి సరిపెడుతున్నారు. కార్యకర్తలు పలకలపై అక్షరాలు రాయించడంతో తమ పని అయిందనిపిస్తున్నారు.

పలకలతోనే సరి

ఆరు నెలల కిందట బాధ్యతలు స్వీకరించిన కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలపై శ్రద్ధ చూపడం లేదు. విద్యా సంవత్సరానికి ప్రారంభానికి ముందే అంగన్వాడీ చిన్నారులకు పుస్తకాలను అందించాలి. కానీ విద్యా సంవత్సరం సగం ముగిసినా నేటికీ పుస్తకాలు అందకపోవడం దారుణం. అంతేకాకుండా ఎప్పుడు పుస్తకాలు అందిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. చిన్నారుల పట్ల కూటమి ప్రభుత్వ తీరుపై తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ జగన్ సర్కార్ హయాంలో..

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పేద చిన్నారులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీ కేంద్రాలపై దృష్టి సారించారు. అలాగే వాటి అభివృద్ధి కోసం ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2 కిట్లను అందించారు. వీటిని ఆకర్షణీయమైన బొమ్మలతో చిన్నారులకు పుస్తకాలపై ఇష్టం కలిగి చదువుకునేందుకు శ్రద్ధ కనబరిచేలా తయారు చేయించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల తరహాలో చదువు చెప్పించడంతోపాటు ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించే విధంగా ఏర్పాట్లు చేయించారు. 3, 4 సంవత్సరాల చిన్నారులకు ఇంగ్లీషు, లెక్కలు, స్పోకెన్ ఇంగ్లీషు, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన ప్రీ ప్రైమరీ–1 కిట్లను అందించారు. అలాగే 4, 5 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు ఇవే ఐదు పుస్తకాలతో కూడిన ప్రీ ప్రైమరీ –2 కిట్లను అందించి, అలాగే ఆ పుస్తకాలపై కార్యకర్తలకు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ విధంగా నాటి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

పుస్తకాలు వచ్చిన వెంటనే అందిస్తాం!



అంగన్వాడీ చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పుస్తకాలు వచ్చిన వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటాం. చాలా కేంద్రాల్లో పాత పుస్తకాలతోనే విద్యాబోధన చేయిస్తాం. విద్యార్థులు చదువుకునేందుకు పుస్తకాల సమస్య ఆటంకంగా మారకుండా కార్యకర్తలు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో బోధిస్తున్నారు.

– శ్రీలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్, కడప

సీఎం దృష్టికి గండికోట నిర్వాసితుల సమస్యలు

- మంత్రి నిమ్మల రామానాయుడు



మాట్లాడుతున్న మంత్రి నిమ్మలరామనాయుడు

కొండాపురం/జమ్మలమడుగు: గండికోట నిర్వాసితుల నష్టపరిహారం చెల్లింపుల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టును ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసులు ఎస్ఈ మల్లికార్జునరెడ్డిలతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగిన పరిస్థితుల్లో 2014–19 లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇరిగేషన్ శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పరిస్థితి మీకందరికి తెలుసు అని అన్నారు. అలాగే పునరావాస కేంద్రాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం, పాఠశాల భవనాల నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసికెళ్లి సమస్యలు లేకుండా చేస్తామని నిర్వాసితులతో పేర్కొన్నారు. 2019–24లో రెండింతల బడ్జెట్ వచ్చినా జగన్ పాలనలో కేవలం 32 వేల కోట్లు కేటాయించారు.అందులో రూ. 19 వేల కోట్లు ఖర్చుపెట్టారు.మిగతావి వారి జేబులోకి వెళ్లాయని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.2500 కోట్లతో టెండర్ పిలిచి ముందుకు పోతున్నామన్నారు. అనంతరం నిర్వాసితుల నుంచి అర్జీలు స్వీకరించారు.అంతకు ముందు జమ్మలమడుగు మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం గండికోటలో నిర్మిస్తున్న రోప్‌వేను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గండికోట ముంపు వాసుల సమస్యల పరిష్కారం, నష్టపరిహారం ఇచ్చేందుకు కృషిచేస్తామన్నారు.

చారిత్రక కట్టడాల పరిరక్షణకు చర్యలు

- సిద్దవటాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మంత్రి కందుల దుర్గేష్



మట్లి రాజుల కోటలోని దర్గాలో పూజలు చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

సిద్దవటం: సిద్దవటాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లిరాజుల కోటను ఆదివారం సాయంత్రం రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పర్యాటక అధికారులతో కలిసి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లడుతూ చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రెండవ శతాబ్దం నాటి మట్లిరాజులు నిర్మించిన అద్భుతమైన కోటలోని శివాలయం, మసీదు, దర్గా, విజయనగరం రాజుల శాలివాహన శకం విజయాభ్యుదయ బండను పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో చర్చించి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం పీపీపీ మోడల్‌లో ఇన్‌వెస్టర్లతో ఇటీవలే సమావేశాలను కూడా నిర్వహించామన్నారు. సిద్దవటం కోట చుట్టూ ఉన్న దేవాలయాలను పరిరక్షించి వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే ఈ ప్రాంతంలో సఫారీ, బోటింగ్, రెస్టారెంటు, సర్క్యూట్ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కోటలోని శిథిలావస్థకు చేరుకున్న వాటికి మరమ్మతులు చేపడతామన్నారు. అలాగే ఇక్కడికి వచ్చే పర్యాటకులు బస చేసి ఇక్కడి ప్రాంతాలను సందర్శించుకొనే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు.

నేడు 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారానికి సోమవారం జిల్లాలోని 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ లోని అట్లూరు మండలం యస్.వెంకటాపురం, బి.కోడూరు మండలం మేకవారిపల్లి, బి.మఠం మండలం బూదవాడ, బద్వేల్ మండలం కోనసముద్రం, గోపవరం మండలం లక్కవారిపల్లి, కలసపాడు మండలం రాజుపాలెం, మైదుకూరు మండలం వనిపెంట, పోరుమామిళ్ల మండలం గానుగపెంట, పులివెందుల రెవిన్యూ డివిజన్‌లోని పులివెందుల మండలం కె .వెలమవారిపల్లి, వీఎన్ పల్లి మండలంలో లింగాల, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని దేవగుడి, కొండాపురం మండలంలో కోనవారిపల్లి, మైలవరం మండలంలోని యం .కంబలదిన్నె, రాజుపాలెం మండలం అర్కటవేముల, కడప రెవెన్యూ డివిజన్‌లోని సీకే దిన్నె మండలం మామిళ్లపల్లె, ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లి, పెండ్లిమర్రి మండలం గొందిపల్లె, వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

ఈసారైనా చర్చ సవ్యంగా సాగేనా!

నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం



కడప నగరపాలక సంస్థ కార్యాలయం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నవంబర్ 7వ తేదీ నిర్వహించిన సమావేశంలో మేయర్‌తో సమానంగా కుర్చీ వేయలేదని ఎమ్మెల్యే ఆర్. మాధవి పోడియంపై నిల్చొని మాట్లాడేందుకు అవకాశమివ్వాలని అడిగి..నిరంతరాయంగా మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. మొదట ఎజెండాపై చర్చ మొదలు పెట్టి అంశాల వారీగా మాట్లాడాలని ఎమ్మెల్యేకు సూచించినా ఆమె పట్టించుకోలేదు. ఈ క్రమంలో అరుపులు, కేకలు, వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. మీరు నాకు కుర్చీ వేసేదేంటి..ప్రజలు అంత కంటే పెద్ద కుర్చీ నాకిచ్చారు అంటూ ఎమ్మెల్యే విమర్శలకు దిగారు. అంతకుముందు ఎమ్మెల్యే మాధవి తన నివాసం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా వచ్చారు. ఎమ్మెల్యే కార్పొరేషన్ కార్యాలయంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు కార్పొరేషన్ కార్యాలయ గేటు వద్ద ఆందోళన చేసి మేయర్‌కు, కార్పొరేటర్లకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. మరికొందరు టీడీపీ నాయకులు సర్వసభ్య సమావేశం ఎదురుగా ఉన్న సమావేశ మందిరంలో తిష్ట వేసి మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో గత సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడింది. టీడీపీ నాయకులంతా వెళ్లిపోయిన తర్వాత మళ్లీ సమావేశం నిర్వహించేందుకు మేయర్, కార్పొరేటర్లు చేసిన ప్రయత్నాలు పోలీసు, కార్పొరేషన్ అధికారుల తీరుతో విఫలమయ్యాయి.

ఒక్కరు ఉన్నప్పుడే అంత...
8 మందితో కలిసి ఇంకెంతో..

ఇదిలా ఉండగా కడప నగరపాలక సంస్థలో వైఎస్సార్‌సీపీ తరపున గెలిచిన 8 మంది కార్పొరేటర్లు ఇటీవల టీడీపీ కండువా కప్పుకున్నారు. టీడీపీకి ఇదివరకున్న ఏకైక కార్పొరేటర్, ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యేలతో కలిపితే వారి బలం 11కు పెరిగినట్లయ్యింది. మొత్తం 50 మంది కార్పొరేటర్లలో ఇద్దరు మరణించారు. మిగిలిన 48 మందిలో 9 మంది టీడీపీ, 39 మంది వైఎస్సార్‌సీపీ, ఐదుగురు కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. ఒక్కరు ఉన్నప్పుడే అంత రచ్చ చేసిన ఎమ్మెల్యే మాధవి, 8 మంది కార్పొరేటర్లతో కలిసి మరెంత రభస సృష్టిస్తారోనని అటు కార్పొరేటర్లు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా కార్పొరేషన్‌లో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు వారు పక్కా వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం.

- కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

- ఈసారి సమావేశంలో నగరపాలక అధికారులు 47 అంశాలు ఎజెండాలో పొందుపరిచారు. అందులో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద మంజూరైన అన్‌టైడ్ గ్రాంట్ రూ.4.76కోట్లు, టైడ్ గ్రాంట్ రూ.7.15కోట్లకు ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలపాల్సి ఉంది. దీనితోపాటు మరికొన్ని కీలక అంశాలు ఎజెండాలో పొందుపరిచారు. వీటిన్నింటిపై సభ్యులు అర్థవంతమైన చర్చ చేసి నగరపాలక సంస్థ అభివృద్ధికి పాటుపడతారా లేదా అహంకారానికి పోయి మళ్లీ గొడవ సృష్టిస్తారా వేచి చూడాలి.

పటిష్ట పోలీస్ బందోబస్తు అవసరం

గత సర్వసభ్య సమావేశం జరిగినప్పుడు ప్రతి ఒక్కరి గుర్తింపు కార్డులు ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసి లోపలికి అనుమతించిన పోలీసులు...అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల పట్ల కొంత ఉదాసీనత ప్రదర్శించినట్లు తెలుస్తోంది. అందువల్లే చాలామంది కౌన్సిల్ సమావేశం ఎదురుగా ఉన్న మరో సమావేశ మందిరంలో ఉండి నినాదాలు చేశారు. మరికొందరు సమావేశ మందిరం లోపలికి సైతం చొరబడ్డారు. వీరికితోడు వందల సంఖ్యలో టీడీపీ నాయకులు కింద గేటు వద్ద ఆందోళన చేసి ఘర్షణ వాతావరణం సృష్టించారు. ఈసారి ఆ తరహా పొరపాట్లకు తావివ్వకుండా కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, మీడియా ప్రతినిధులను మాత్రమే అనుమతించేలా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నేడు కార్పొరేషన్ వద్ద 144 సెక్షన్ అమలు

కడప అర్బన్: కడప కార్పొరేషన్ వద్ద సోమవారం జనరల్ బాడీ సమావేశం జరగనున్న నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కడప వన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. కడప నగరంలో ఇప్పటికే పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు. కార్పొరేషన్ ఎదుట నలుగురి కంటే ఎక్కువ మంది ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నమయ్య జిల్లాలో కాల్పుల కలకలం

వ్యాపారులే టార్గెట్‌గా దుండగులు రెచ్చిపోయారు. ఒక్కసారిగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు సరిహద్దున ఉన్న అటవీ ప్రాంతంలో తుపాకుల కాల్పులకు అక్కడి వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలో కలకలం సృష్టించింది.

- చిరు వ్యాపారులపైకి దూసుకువచ్చిన తుపాకి గుళ్లు
- మాధవరం–కాటిమాయకుంట అటవీ ప్రాంతంలో ఘటన
- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐలు





కాల్పుల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన హనుమంతు, చికిత్స పొందుతున్న వెంకటరమణ

రాయచోటి/కడప అర్బన్: అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ మండలం మాధవరం–కాటిమాయకుంట గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. పేల్చిన తుపాకీ గుళ్లు పూసలు, చిక్కు వెంట్రుకల వ్యాపారుల కడుపుల్లో దూసుకుపోయాయి. ఈ ఘటనలో ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరొకరు మృత్యువాత పడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో అటవీ ప్రాంత ప్రదేశంలో తుపాకీని పేల్చారు. అసలు ఆ సమయంలో గ్రామాలు తిరిగి పూసలు అమ్ముకునే వారికి ఆ అటవీ ప్రాంతంలో పనేముంది.. వీరినే తుపాకులతో మూడు సార్లు ఎందుకు కాల్చారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలలోకి వెళ్లితే... సంబేపల్లె మండల కేంద్రంలో సల్ల రమణ (30), నీలకంఠ హనుమంతు(45) కుటుంబంతో కలిసి చుట్టుపక్కల గ్రామాలలో పూసలు, చిక్కు వెంట్రుకలు, డబ్బా రేకులతో తయారుచేసిన కొన్ని పరికరాలను అమ్ముకుని జీవనం సాగించేవారు. అలాగే వారికి కొన్ని మేకలు కూడా ఉన్నాయి. స్థానికంగా మేకలకు తగిన ఆహారం లేకపోవడంతో రాయచోటి రూరల్ మండల పరిధిలోని కాటిమాయకుంట అటవీ ప్రాంత పరిధిలో వాటిని మేపుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. ఇదే క్రమంలో సమీప గ్రామాల్లో పర్యటిస్తూ చిరు వ్యాపారం ద్వారా బియ్యం, డబ్బులు పొంది కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు కొండ అవతల ఉన్న మాధవరం గ్రామ పరిధిలోని మద్దెలకుంట గ్రామానికి బయలు దేరినట్లు ప్రమాదంలో గాయపడిన రమణ తెలిపారు. ఐదు గంటల సమయంలో రెండు గ్రామాల మధ్యలో ఉన్న అటవీ ప్రాంతంలో ఇద్దరం నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా తుపాకీ తూటాలు మా పొట్టల్లోకి దూసుకువెళ్లాయన్నారు. ఈ దాడిలో సల్ల రమణ(30) కడుపులోకి తూటాలు చొచ్చుకెళ్లాయి. అలాగే పక్కన ఉన్న నీలకంఠ హనుమంతు(45) కడుపులోకి మరో తూటా దూసుకు వచ్చిందని బాధితుల నోట వినిపించాయి. తూటాలకు గాయపడి రక్తం పారుతున్నా వాటిని బిగ పట్టుకుని అక్కడ నుంచి కేకలు వేస్తూ కాటిమాయకుంట సమీపంలో తామున్న ప్రదేశాలకు (గుడారాల వద్దకు) చేరుకున్నామన్నారు. అక్కడ నుంచి ఆటోలో రక్తంతో తడిచిపోయిన వారిద్దరు చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఇరువురికీ కడుపులో తూటాలు ఉండటంతో మెరుగైన అత్యవసర చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నీలకంఠ హనుమంత మృతిచెందాడు. రమణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే తుపాకులతో కాల్చిన ప్రదేశంలో ఎవరున్నది చూడలేదని, సమీపంలో స్కూటర్ ఉన్నట్లు గుర్తించామని వారు పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ

తుపాకులతో కాల్చిన ప్రదేశాన్ని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ చంద్రశేఖర్ సందర్శించారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని పూర్తిగా పరిశీలించడంతో పాటు గ్రామ పరిధిలో నాటు తుపాకులు ఉపయోగించే వారి వివరాలను సేకరించాలని కింది స్థాయి సిబ్బందిని డీఎస్పీ ఆదేశించారు. అలాగే జాగిలాలతో ఆ ప్రాంతంలోని ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తుపాకులతో కాల్చిన వారు అడవి జంతువుల కోసం వచ్చారా? లేక మరేదైనా కుట్ర కోణం దాగి ఉందా అన్న అనుమానాలపై విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. జరిగిన సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. మూడు బృందాలుగా ఏర్పడి సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై విచారణ సాగిస్తున్నట్లు ఆయన వివరించారు.

భిక్షమెత్తుకుని జీవనం సాగిస్తున్నాం

మా జీవనం ఊరూరూ తిరిగి చిక్కు వెంట్రుకలు సేకరించుకుంటూ, పూసలు అమ్మడం, డబ్బా రేకులతో తయారు చేసిన చాటలు అమ్ముకోవడం, వారిచ్చిన చిల్లర, బియ్యంతో కుటుంబాన్ని పోషించుకోవడం మా వృత్తి అని బాధితుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వీటికి తోడు కొన్ని మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తుపాకీ తూటాలకు గాయపడ్డ మా బిడ్డలను రక్షించుకోవడానికి మా దగ్గర ఆర్థికస్తోమత లేదంటూ ఆ మహిళలు ఆసుపత్రి ఆవరణంలో బోరున విలపించారు. మా బిడ్డలపై ఎందుకు కాల్పులు జరిపారో తెలియదని వాపోయారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్ ఫరూక్ అహమ్మద్

లింగాల : లింగాల మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌తో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి చెందిన ఫరూక్ అహమ్మద్(60) అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని అరటి కాయల వ్యాపారి గోడౌన్ సమీపంలో మరో లారీలోకి బాక్సులు మార్చేందుకు విద్యుత్ లైన్ కిందకు వెళ్లడంతో 11 కేవీ విద్యుత్ వైరు తెగి పడింది. వంద మీటర్ల దూరంలో లారీ డ్రైవర్ ఫరూక్ అహమ్మద్ నీటితో లారీని శుభ్రం చేస్తుండగా విద్యుత్ వైర్లు ఆయనపై పడ్డాయి. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం 108 వాహనంలో పులివెందులకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారని ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

బోడిశెట్టిపల్లిలో కొండచిలువ



గ్రామస్తులు చంపేసిన కొండ చిలువ

అట్లూరు : మండల పరిధిలోని బోడిశెట్టి పల్లి గ్రామంలో శనివారం రాత్రి కొండచిలువ ప్రత్యక్షం కావడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. స్థానికుల వివరాల మేరకు గ్రామంలో ఉన్నట్లుండి గొర్రెలు, మేకలు బెదురుకోవడంతో గ్రామంలోని కొంత మంది మహిళలు వచ్చి పరిశీలించగా సుమారు పది అడుగుల పొడవు గల కొండచిలువ కనిపించింది. దీంతో వారు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి కొండచిలువను చంపి వేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పొట్టిపాడు రోడ్డులో కంచెర్ల శ్రీకాంత్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి గోవా రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ఉప్పాగు వద్ద మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి సిబ్బందితో కలసి ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో కంచెర్ల శ్రీకాంత్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి గోవా రాష్ట్రానికి చెందిన 12 మద్యం ఫుల్ బాటిళ్లతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి మద్యం సరఫరా చేసిన కాటం వీరేంద్ర అనే వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

అన్నదాతకు మరో అవకాశం

పంటల బీమా ప్రీమియానికి గడువు పొడిగింపు

పంట	ఎకరాకు చెల్లించాల్సింది (రూపాయల్లో)	హెక్టారుకు చెల్లించాల్సింది (రూపాయల్లో)
వరి	638	1575
శనగ	486	1200
వేరుశనగ	486	1200
జొన్న	319	787.5
పెసలు	273	675
మినుములు	288	712.5
నువ్వులు	182	450
సన్‌ఫ్లవర్	304	750
మామిడి	2100	5250



సాగులో ఉన్న వరిపంట

కడప అగ్రికల్చర్ : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లింపునకు మరో అవకాశం కల్పించింది. పంటల బీమా చెల్లింపునకు గడువు కావాలని రైతుల అభ్యర్థన మేరకు ఈ నెల 31వ తేదీ వరకు గడువును పెంచి కేంద్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో మన జిల్లాలో ఇప్పటి వరకు 1,00099 హెక్టార్లలో వివిధ ఉద్యాన, వ్యవసాయ పంటలను సాగు చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో ఏటా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రధానమంత్రి వసల్ బీమా యోజన కింద బీమా వసతి కల్పించింది. ప్రధానంగా వరి, వేరుశనగ, పొద్దుతిరుగుడు, శనగ, పెసర, మామిడి, నువ్వుల పంటలను వాతావరణ ఆధారిత బీమా కింద చేర్చింది. రుణం తీసుకునే రైతులకు బ్యాంకులే ప్రీమియం మినహాయిస్తాయి. మిగతా రైతులు నేరుగా చెల్లించుకోవాల్సి ఉంటుంది.

మరో 9 రోజులు అవకాశం..

రబీ కాలంలో పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు తొలుత వరికి మాత్రమే డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు ప్రకటించింది. ఆ తరువాత మామిడికి కూడా 31వ తేదీ వరకు గడువును పెంచింది. ఇప్పటికీ పంటల బీమా ప్రీమియం చెల్లించని రైతులు ఈ గడువులోపు చెల్లించుకోవాల్సి ఉంది.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



రబీ సీజన్‌లో పంటల బీమా కోసం ప్రభుత్వం గడువు పెంచింది. గతంలో వరికి మాత్రమే డిసెంబర్ 31 వరకు గడువు ఉండేది. అలాంటిది తరువాత మిగతా పంటలైన వరి, వేరుశనగ, పొద్దుతిరుగుడు, శనగ, పెసర, మామిడి, నువ్వుల పంటలకు కూడా ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచింది. ఇంకా ప్రీమియం చెల్లించని రైతులు ఉంటే తక్షణం ప్రీమియం చెల్లించుకోవాలి.

- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ధైర్యముంటే రాజీనామా చేసి గెలవండి

- మేయర్‌పై నిందలు వేస్తే సహించం
- వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు ధైర్యముంటే రాజీనామా చేసి తెలుగుదేశం కండువా వేసుకుని గెలవాలని వైఎస్సార్‌సీపీ అనుబంధ మహిళా విభాగం నేతలు సవాల్ విసిరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ తమ పార్టీ గుర్తుపై గెలిచి ఇటీవల టీడీపీలోకి ఫిరాయించిన కార్పొరేటర్లు తమను తాము సమర్థించుకుంటూ ఎదురుదాడికి దిగడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. చల్లా రాజశేఖర్ తండ్రి చాలాకాలంగా టీడీపీలో ఉన్నారని తెలిపారు. రాజశేఖర్ వైఎస్సార్‌సీపీలో సభ్యత్వం పొందారన్నారు. అయినా నమ్మకంతో పార్టీ టిక్కెట్ ఇచ్చి కార్పొరేటర్‌గా గెలిపించుకున్నామని పేర్కొన్నారు. అయితే అధికారం ఉన్నన్నాళ్లు ఇక్కడ లబ్ధి పొంది, పార్టీ అధికారం కోల్పోగానే టీడీపీలోకి జంప్ కావడం అంటే ఆయనకు ఏమాత్రం విలువలు లేవన్న విషయం అర్థమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీలో ఆయనకు జరిగిన అన్యాయం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలువబోతోందని, అప్పుడు ఈ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సునీత మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గుర్తు లేకపోతే కార్పొరేటర్ బాలకృష్ణారెడ్డిని తమ డివిజన్‌లో ప్రజలెవరూ గుర్తించలేరన్నారు. ఇన్నాళ్లు అధికారాన్ని అనుభవించి టీడీపీలోకి వెళ్లడం కాదని, రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి మాట్లాడుతూ కార్పొరేటర్ సుబ్బారెడ్డి కోట్లాది రూపాయల బిల్లులు చేసుకున్నారని తెలిపారు. తమ డివిజన్ ప్రజలు ఆయనకు టిక్కెట్ ఇవ్వవద్దంటూ ఏనాడో చెప్పారని పేర్కొన్నారు. కానీ మేయర్ సురేష్‌బాబు దయతలచి టిక్కెట్ ఇప్పించి గెలిపించారన్నారు. మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలను విమర్శించే హక్కు ఆయనకు లేదని, హుందాగా వ్యవహరించాలని సూచించారు. మహిళా నాయకురాలు చైతన్య మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు నగర ప్రజల కోసం కాదని, టీడీపీ ప్రలోభాలకు లొంగి వెళ్లారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు వేణుగోపాల్ నాయక్, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, కంచుపాటి బాబు తదితరులు మాట్లాడుతూ రాజీనామాలు చేసి టీడీపీలోకి రావాలంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి చేసిన సూచనను ఫిరాయింపు కార్పొరేటర్లు పాటించాలన్నారు.

బలిజలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలి



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

బలిజల ఆత్మీయ సన్మాన సభలో నేతలు

కడప కల్చరల్ : రాయలసీమలో తగినంత సంఖ్యాబలం ఉన్నా సమన్వయ లోపంతో బలిజలకు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆ సామాజిక వర్గం నేతలు అభిప్రాయపడ్డారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకుడు బాలిశెట్టి హరిప్రసాద్, టింబర్ డిపో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడపలోని మేడా కన్వెన్షన్ హాలులో బలిజ నేతల ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించడానికి బలిజ, కాపు, తెలగ, ఒంటరి వర్గాల వారే ప్రధాన కారకులని, ప్రస్తుతం వారే ఈ ప్రభుత్వానికి ప్రధాన బలంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఈ జిల్లాలో ఎంతో ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు మాట్లాడుతూ బలిజలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన పాత్ర వహిస్తూ

బలమైన శక్తిగా ఎదుగుతున్నారని సరైన సమయంలో సరైన పద్ధతిలో స్పందించకపోవడంతోనే ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయాల్లో రాణించాలంటే ఆర్థిక బలం అవసరమని, రానున్న అన్ని ఎన్నికలలో విజయాలను సీరియస్‌గా తీసుకొని కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ జిల్లా బలిజలలో చాలామంది నాయకులు ఉన్నారని, అలాంటి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తాతంశెట్టి నాగేంద్ర సభను పర్యవేక్షించారు. సభలో బలిజల సీనియర్ నేత పీవీఎస్ మూర్తి, సుంకర శ్రీనివాస్, మోదుగుల పెంచలయ్య, దాసరి రాము, 1104 యూనియన్ నాయకుడు రమణ, ఎద్దుల సుబ్బరాయుడు, దుర్గాప్రసాద్, సుధా మల్లికార్జునరావు, అమరప్ప, ధనపాల్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : మండల పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం దాదంవారిపల్లెకు చెందిన ఇర్ఫాన్(20), మదనపల్లె అమ్మచెరువుమిట్టకు చెందిన నిఖిల్(20) ఇద్దరూ కలిసి ఆదివారం మధ్యాహ్నం పుంగనూరురోడ్డులోని దాబాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మదనపల్లెకు వస్తూ వలసపల్లె నవోదయ పాఠశాల సమీపంలో ముందు వెళుతున్న బస్సు, లారీని ఓవర్‌టేక్ చేస్తూ, ఎదురుగా బస్సు రావడంతో దాన్ని తప్పించపోయి అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఇర్ఫాన్ స్థానికంగానే చికిత్స పొందుతున్నాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కర్నాటక చిక్‌బళ్లాపూర్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న రవి(35), లోకేష్ (29) స్నేహితులు. ఇద్దరూ కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలో ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



దాడిలో గాయపడిన బాబుజగన్నాథరావు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని కొంగలవీడు పంచాయతీ ఉప్పత్తివారిపల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఓ వర్గానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో వర్గానికి చెందిన ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఉప్పత్తివారిపల్లె ఎస్సీ కాలనీలో సుమారు పదేళ్లుగా గతంలో జరిగిన ఓ వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని చర్చిని మూతవేశారు. అప్పటి నుంచి ఎవరి ఇళ్లల్లో వారే క్రిస్మస్ పండుగను జరుపుకునేవారు. అయితే సుమారు సంవత్సరం నుంచి జయచంద్ర అనే ఉపదేశికుడు ప్రతి ఆదివారం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తుండేవారు. ఇదే సమయంలో త్వరలో జరగనున్న క్రిస్మస్ పండుగను చర్చి ఆవరణలో నిర్వహించాలని ఓ వర్గానికి చెందిన వారు ఏర్పాట్లు చేసుకుంటుండగా మరో వర్గానికి చెందిన గోపయ్య వాగ్వాదానికి దిగి చర్చికి తాళం వేశారు. దీంతో మరో వర్గానికి చెందిన వారు ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించగా గోపయ్య, ఆయన అనుచరులు మరో వర్గానికి చెందిన బాబుజగన్నాథరావు, మరియన్న, బాబులపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో బాబుజగన్నాథరావుకు ఎడమచేయి విరిగింది. వెంటనే స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జగన్నాథరావును కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ శ్రీకాంత్‌ను అడుగగా చర్చి విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన మాట వాస్తవమేనని, ఇరువురు పోలీసు స్టేషన్‌లో ఇంకా ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అరుణ్ (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణం కడప-రేణిగుంట జాతీయ రహదారిలో రాజ్ రెసిడెన్సీ వద్ద రాఘవరాజపురం దళితవాడకు చెందిన పైనమ్ అరుణ్ (29)ను లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడికి రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. తండ్రి పైనమ్ సుబ్బరాయుడు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సెలవు దినాల్లో స్టడీ అవర్స్ ఉపసంహరించుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : పదో తరగతి విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ పేరిట ఆదివారాలతోపాటు సెలవు దినాల్లో కూడా ఉదయం 9:15 నిమిషాల నుంచి సాయంత్రం 4:00 వరకు స్టడీ అవర్స్ నిర్వహించడం సబబు కాదని దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆయన మాట్లాడుతూ వారాంతపు సెలవుల్లో కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా పదవ తరగతి పిల్లలకు స్టడీ అవర్స్ నిర్వహించడం శ్రేయస్కరం కాదన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు పనిచేసిన తర్వాత మానసిక ఉల్లాసం, విశ్రాంతి ఉండాలని, లేకపోతే స్తబ్దత ఏర్పడుతుందని చెప్పారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల అభివృద్ధితో పాటు వారికి మంచి మార్కుల కోసం పని దినాల్లో ఉదయం, సాయంత్రం ఒక గంట అదనంగా స్వచ్ఛందంగా ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. కనుక సెలవు దినాల్లో స్టడీ అవర్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు ప్రారంభం



విద్యుత్ దీప కాంతులీనుతున్న ఈశ్వరీదేవి మఠం



హోమం నిర్వహిస్తున్న మఠాధిపతి దంపతులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవిమఠం ఉత్సవ శోభను సంతరించుకుంది. విద్యుత్ దీప కాంతులతో ధగధగలాడుతోంది. భక్తజన సందడితో కళకళలాడుతోంది.

అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా కడప వీరబోయిన సుబ్బనరసింహులు, లక్ష్మి, గుంటూరుకు చెందిన కోడూరు సాంబశివరావు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. మఠాధిపతి వీరశివకుమారస్వామి ఆశీస్సులతో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో దేవదాయ శాఖ, మఠం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ముత్తలూరు ఆంజనేయశర్మ, రఘువు వెంకటసుబ్రమణ్యాచార్యులు, అమ్మవారి శిష్యులు తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక భవనం ప్రారంభం

శ్రీ ఈశ్వరీదేవిమఠంలో ఆదివారం ధార్మిక భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు చేశారు. దాతలను మఠాధిపతి వీరశివకుమారస్వామి సత్కరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

భూమి సమస్య పరిష్కరించలేదని సెల్ టవర్ ఎక్కిన రైతు



బాధితుడిని అదుపులోకి తీసుకొన్న అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటి టౌన్ : తన భూమి సమస్య పరిష్కరించలేదని ఆగ్రహించి రామ్మోహన్ నాయుడు అనే రైతు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతూ హల్‌చల్ చేశాడు. రాయచోటి ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి కథనం మేరకు.. రాయచోటి పట్టణ పరిధిలోని అబ్బవరం కొత్త కురవపల్లెకు చెందిన రామ్మోహన్ నాయుడు తన ఆస్తి సమస్యను పరిష్కరించాలంటూ దాయాదులను గత ఐదేళ్లుగా కోరుతున్నాడు. అయితే అందుకు వారు ససేమిరా అనడంతో పాటు పెడచెవిన పెట్టారు. దీంతో ఆయన మనస్థాపానికి గురై ఆదివారం రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులోని సెల్ టవర్ ఎక్కాడు. గమనించిన పోలీసులు ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని బాధితుడిని సముదాయించి కిందికి దింపారు. బాధితుడి ని రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రిటైర్డు లెక్చరర్ అదృశ్యం

రామాపురం : మండల పరిధిలో బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉంటున్న నాగూరు వెంకటరెడ్డి (70) అనే రిటైర్డు లెక్చరర్ 18వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య వెంకటలక్ష్మి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనికి మతిస్థిమితం సరిగా లేదని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మండల పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆటో దగ్ధం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లి దళితవాడకు చెందిన సత్యాల ప్రదీప్‌కు చెందిన ఏపీ39యూతఈ 7344 నంబరు గల ఆటోను ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు.

వీఆర్‌కు కానిస్టేబుల్

రాయచోటి : రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.ధర్మాను వీఆర్‌కు పంపారు. స్టేషన్ పరిధిలోని మాధవరం గ్రామం, కంచరపల్లికి చెందిన ఓ విద్యార్థిపట్ల దురుసుగా ప్రవర్తించడంతో ఆ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే.

మద్యం మత్తు.. ప్రాణాలు చిత్తు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైకు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోలాటం నరసింహులు



మృతి చెందిన కె. సుజాత



తీవ్రంగా గాయపడిన చరణ్ తేజ్



చికిత్స పొందుతున్న త్రిషాన్వీ

బైకును ఢీకొన్న ఆటో

- దంపతుల దుర్మరణం
- కుమారుడి పరిస్థితి విషమం
- మద్యం మత్తులో ఆటో నడపడమే ప్రమాదానికి కారణం



కోలాటం నరసింహులు, సుజాత (ఫైల్ ఫొటో)

ఓబులవారిపల్లె : మద్యం మత్తు, అతి వేగం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. మద్యం తాగి ఆటోను నడుపుతూ ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొనడంతో రాజంపేట మండలం, భువనగిరిపల్లి గ్రామానికి చెందిన కోలాటం నరసింహులు (42), భార్య సుజాత (38) దుర్మరణం చెందారు. వారి కుమారుడు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాలు ఇలా.. భువనగిరిపల్లికి చెందిన కోలాటం నరసింహులు తన అత్తగారి ఊరైన ఓబులవారిపల్లి మండలం, వై.కోట గ్రామానికి వచ్చి తన భార్య, కుమారుడు చరణ్, తమ్ముడి కుమార్తె త్రిషాన్వీతో కలిసి పల్సర్ బైకుపై ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో వై.కోట నుంచి బయల్దేరారు. రెడ్డిపల్లి చెరువుకట్ట వద్దకు రాగానే టాటా ఏస్ లగేజీ ఆటో వేగంగా వచ్చి బైకును ఢీ కొంది. దీంతో బైకు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. నరసింహులు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన భార్య సుజాతను రాజంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కుమారుడు చరణ్ తేజ్ (12) పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. నరసింహులు తమ్ముడి కుమార్తె త్రిషాన్వీ చికిత్స పొందుతోంది. మద్యం మత్తులో బైకును వేగంగా ఢీ కొని టాటా ఏస్ వాహనం వెళ్లిపోయింది. ఆటో కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇంటి నుంచి బయల్దేరిన అరగంటలోనే కుమార్తె చనిపోయిందన్న చేదు వార్తను విని సుజాత తల్లిదండ్రులు, బంధువులు గుండెలు పగిలేలా రోదించారు. భువనగిరిపల్లిలో బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నరసింహులుకు భార్య సుజాత, కుమారుడు చరణ్ తేజ్ ఉన్నారు. గ్రామంలో మంచి పేరు తెచ్చుకున్న నరసింహులు ఇటీవల అయ్యప్పస్వామి మాల ధరించి శబరిమలైకు వెళ్లి వచ్చి అత్తగారింటికి వెళ్లి వస్తుండగా ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వై.కోట, భువనగిరిపల్లి గ్రామాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ పి.మహేష్ తెలిపారు.